సాక్షి
అనంతపురం


శుక్రవారం : 2 : ఫిబ్రవరి : 2024

I



'హంద్రీ-నీవా'కు అభయం
హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్ట్ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభయమిచ్చారు.

IIలో



కిలో టమాట రూ.16
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
34.2°/16.4°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి వాతావరణం కొనసాగు తోంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

అనంతపురం డీఎస్పీగా వీర రాఘవ రెడ్డి
- గుంతకల్లు డీఎస్పీగా శివభాస్కర్ రెడ్డి నియామకం
- ఉమ్మడి జిల్లాలో పలువురు డీఎస్పీలకు స్థాన చలనం



డీఎస్పీ వీర రాఘవరెడ్డి

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలువురు డీఎస్పీలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం డీఎస్పీగా జి. వీర రాఘవ రెడ్డిని నియమించారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేస్తున్న ప్రసాద రెడ్డిని మదనపల్లికి బదిలీ చేశారు. అలాగే, పెనుకొండ డీఎస్పీ హుస్సేన్ పీరాను అప్పా (ఆంధ్రప్రదేశ్ పోలీసు అకాడమీ)కు, వెయింటింగ్‌లో ఉన్న వెంకటేశ్వర రావును అనంతపురం పీటీసీకి పంపారు. గుంతకల్లు డీఎస్పీగా శివభాస్కర్ రెడ్డిని, పెనుకొండ డీఎస్పీగా షేక్‌బాజీజాన్ సైదాను నియమించారు.

పశు బీమా చేయించండి



అనంతపురం అగ్రికల్చర్: దేశీయ, సంకరజాతి పాడి పశువులు, గేదెలు, ఎద్దులు, దున్నలు, గొర్రెలు, మేకలకు పశుబీమా చేయించాలని పశుసంవర్ధక శాఖ అనంతపురం డివిజన్ డీడీ డాక్టర్ వై.రమేష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడి రైతులు ఆర్థికంగా నష్టపోకుండా 'వైఎస్సార్ పశుబీమా' పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. పాడి రైతులు, కాపర్లు తమ వాటా కింద 20 శాతం ప్రీమియం చెల్లిస్తే, మిగతా 80 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. పశుశాఖ డీడీలు, ఏడీలు, డాక్టర్లు, పారా స్టాఫ్‌ను సంప్రదించి బీమా పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

నేడు 'ఎస్పీసీఏ' కమిటీ సమావేశం

అనంతపురం అగ్రికల్చర్: సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ టు అనిమల్ (ఎస్పీసీఏ) జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టర్ ఎం. గౌతమి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. జంతుహింస, గోవధ, పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్ మినీకాన్ఫరెన్స్ హాలులో సమావేశం ఉంటుందన్నారు.కలెక్టర్ తోపాటు ఎస్పీ, జెడ్పీ సీఈఓ, మున్సిపల్ కమిషనర్, డీపీఆర్ఓ, డీఈఓ, డీఎఫ్ఓ, డీటీఓ, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్, మార్కెటింగ్ ఏడీ, డీపీఓ తదితర జిల్లా స్థాయి అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఏసీబీ వలలో విద్యుత్‌శాఖ ఏఈ



పట్టుబడిన ఏఈ చంద్రశేఖర్

గుత్తి: ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు కోసం ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు వజ్రకరూరు విద్యుత్‌శాఖ ఏఈ చంద్రశేఖర్ పట్టుబడ్డాడు. వివరాలు.. గుత్తి ఆర్ఎస్‌లో నివాసం ఉంటున్న చంద్రశేఖర్ వజ్రకరూరు విద్యుత్ శాఖ ఏఈగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో వజ్రకరూరు మండలం చాబాలకు చెందిన రైతు ఆనంద్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకుని ఏఈని కలవగా రూ.30 వేలు లంచం డిమాండ్ చేశాడు. రూ.20 వేలు చెల్లిస్తానంటూ ఒప్పందం కుదుర్చుకున్న రైతు... ఏసీబీ అధికారులను సంప్రదించి, వారి సూచన మేరకు గురువారం సాయంత్రం గుత్తి బస్టాండు వద్ద ఉన్న ఏఈ చంద్రశేఖర్‌కు డబ్బులిస్తుండగా ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి, సీఐ ప్రభాకర్‌గౌడ్ వల పన్ని పట్టుకున్నారు. అనంతరం చంద్రశేఖర్‌ను గుత్తి విద్యుత్ శాఖ డీఈ కార్యాలయానికి తీసుకెళ్లి రాత్రి పొద్దుపోయేవరకూ విచారించారు. పంచనామా అనంతరం నిందితుడిని శుక్రవారం ఉదయం కర్నూలు ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

ఏఈఆర్ఓ, బీఎల్ఓలకు షోకాజ్

అనంతపురం అర్బన్: ఓటర్ల జాబితా తయారీలో తప్పిదాలపై తాడిపత్రి, అనంతపురం నియోజకవర్గాల పరిధిలోని బీఎల్ఓలకు కలెక్టర్ ఎం. గౌతమి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తాడిపత్రి నియోజకవర్గ పరిధిలోని ఒక మండల ఏఈఆర్ఓ (తహసీల్దారు)కు, ముగ్గురు బీఎల్ఓలకు, అనంతపురం అర్బన్ నియోజవర్గం పరిధిలో ఒక సూపర్‌వైజర్, నలుగురు బీఎల్ఓలకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు సమాచారం.



- తాడిపత్రి నియోజకవర్గం యాడికి మండలానికి చెందిన లక్ష్మీకుమారి నిండు గర్భిణి. 15 రోజుల క్రితం ఆమెకు అర్ధరాత్రి 12 గంటల సమయంలో పురిటినొప్పులు రావడంతో 108కు ఫోన్ చేశారు. 20 నిమిషాల్లో అంబులెన్సు వచ్చింది. సకాలంలో అనంత సర్వజనాసుపత్రికి చేర్చింది. లక్ష్మీకుమారి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది.

- వజ్రకరూరు మండలానికి చెందిన వీరన్న కొన్ని రోజుల క్రితం పంట కాపలాకు రాత్రి 10 గంటల సమయంలో పొలానికి వెళ్లి పాము కాటుకు గురయ్యాడు. వెంటనే 108కు ఫోన్‌చేయగా ఆగమేఘాలపై అంబులెన్సు వచ్చింది. అనంతపురం ఆస్పత్రికి తీసుకొచ్చి ప్రాణాలు నిలిపింది.

నేనున్నానని.. మీకేం కాదని!

- ప్రజలకు భరోసా ఇస్తున్న 108 అంబులెన్సులు
- నాలుగేళ్లలో 3.73 లక్షల మందిని రక్షించిన రథాలు
- 82 వేల మందికి పైగా గర్భిణులకు సేవలు
- టీడీపీ హయాంలో డీజిల్‌కూ దిక్కులేక చతికిల
- వైఎస్సార్ సీపీ హయాంలో పథకానికి పునరుజ్జీవం
- మండలానికి రెండు అంబులెన్సులు కేటాయించిన సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అర్ధరాత్రి అపరాత్రి అన్న తేడా లేదు. పల్లె, పట్నం అన్న భేదం చూపదు. ఆపదలో ఉన్నామని కాల్ వచ్చిందంటే చాలు కుయ్ కుయ్ మంటూ ముంగిటకే వచ్చేస్తుంది. బాధితులకు కొండంత ధైర్యం ఇచ్చేస్తుంది. దివంగత నేత వైఎస్సార్ హయాంలో పురుడు పోసుకున్న 108 పథకం ఆపన్నులకు అందిస్తున్న భరోసా అంతా ఇంతా కాదు. ఏపీలో అమలవుతున్న ఈ వ్యవస్థ దేశంలో మిగతా రాష్ట్రాలకూ ఆదర్శంగా మారింది. గడిచిన నాలుగేళ్లలోనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో 108 అంబులెన్సుల ద్వారా 3.73 లక్షల మందికి పైగా సేవలు పొందారంటే ప్రజలకు ఎంతలా ఈ వ్యవస్థ సాంత్వన చేకూర్చిందో అర్థం చేసుకోవచ్చు.

టీడీపీ హయాంలో అధ్వానం..

ఎంతో గొప్ప ఉన్నతాశయంతో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని చంద్రబాబు పూర్తిగా నిర్వీర్యం చేశారు. డీజిల్‌కూ డబ్బుల్లేవంటూ మొండిచేయి చూపారు. మరమ్మతులకు నిధులు మంజూరు చేయక అటకెక్కించేందుకు యత్నించారు. 108 అంబులెన్సులను ఎక్కువగా పేదలే ఉపయోగించుకుంటారనే కనీస ఆలోచన కూడా చేయకుండా పూర్తిగా కనుమరుగు చేసేలా వ్యవహరించారు.

పునరుజ్జీవం పోసిన సీఎం జగన్

అవసాన దశకు చేరిన 108 వ్యవస్థపై సీఎం జగన్ వచ్చీ రాగానే ప్రత్యేక దృష్టి సారించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చే నాటికి మండలానికి ఒక అంబులెన్సు కూడా అందుబాటులో లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63 మండలాలు ఉండగా 32 వాహనాలు మాత్రమే ఉండేవి. అవికూడా 5 లక్షల కిలోమీటర్ల పైగా తిరిగి అవసాన దశకు చేరాయి. అలాంటిది మండలానికి రెండు కొత్త అంబులెన్సులతో పాటు అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్సులను సీఎం జగన్ కేటాయించారు. ఒక నియోనేటల్ (చిన్నారుల కోసం) అంబులెన్సు ఏర్పాటు చేశారు. తగినంత మంది సిబ్బందిని నియమించారు.

లక్షల మందికి సేవలు

జిల్లా వ్యాప్తంగా నేడు 108 వ్యవస్థ పరుగులు పెడుతోంది. గతంలో సంవత్సరమంతా కలిపినా 45 వేల మందికి కూడా సేవలు అందేవి కావు. నేడు ఏడాదిలోనే సేవలు పొందుతున్న వారి సంఖ్య 1.10 లక్షలకు పైగానే చేరుకుంది. నాలుగేళ్లలో 82 వేల మందికి పైగా గర్భిణులు సేవలు పొందారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఫోన్ చేసిన 25 నిమిషాల్లో, పట్టణాల్లో అయితే 15–20 నిమిషాల్లో ఘటనా స్థలికి అంబులెన్సులు చేరుకుంటున్నాయి.

గడిచిన నాలుగేళ్లలో 108 సేవలు అందుకున్న వారు ఇలా..

సంవత్సరం	సేవలు పొందిన వారి సంఖ్య	గర్భిణులు
2020	39,177	8,030
2021	1,09,446	10,446
2022	1,04,651	26,281
2023	1,19,953	20,051

ఉమ్మడి అనంత జిల్లాలో 108 వివరాలు ఇలా..

మొత్తం అంబులెన్సులు	66
అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్సులు	15
బేసిక్ లైఫ్ సపోర్ట్ అంబులెన్సులు	49
నియోనేటల్ అంబులెన్సులు	02
ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు	165
పైలెట్లు (డ్రైవర్లు)	165

ప్రాణం కాపాడింది



15 రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో పురిటి నొప్పులు మొదలయ్యాయి. తెల్లారేసరికి మరింత ఎక్కువయ్యాయి. కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. సకాలంలో వాహనం వచ్చింది. ఆస్పత్రికి వెళ్లే క్రమంలో నొప్పులు భరించడం సాధ్యం కాక రాయంపల్లి వద్ద వాహనం పక్కకు ఆపించాం. ఈఎంటీ రామతులసి కాన్పు చేసింది. తల్లీబిడ్డ సురక్షితంగా ఉన్నాం. 108 వాహనం నా ప్రాణమే కాకుండా బిడ్డ ప్రాణాలూ కాపాడింది.

– సువర్ణ, రంగచేడు, గుమ్మఘట్ట మండలం

108 లేకుంటే బతికేదాన్ని కాదేమో!



గత నెల 6వ తేదీన వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా పాము కాటేసింది. వెంటనే తోటి కూలీలు 108కు సమాచారం అందించారు. గార్లదిన్నె నుంచి 108 వాహనం క్షణాల్లోనే చేరుకుంది. సిబ్బంది ఇంజెక్షన్లు వేసి ఎంతో ధైర్యం చెప్పారు. సకాలంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు మెరుగైన సేవలు అందించడంతో ప్రాణాలతో బయటపడ్డా. 108 వాహనం రాకపోయింటే అసలు బతికేదాన్నే కాదేమో!.

– రంగమ్మ, కల్లూరు, గార్లదిన్నె మండలం

జిల్లాకు సరిపడా అంబులెన్సులు



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టాక 108 సేవలు మెరుగుపడ్డాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లాకు సరిపడా అంబులెన్సులు సమకూర్చింది. దాదాపు అన్ని మండలాలకు 2 అంబులెన్సులు ఉన్నాయి. దీంతో సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలికి వాహనాలు చేరుకుంటున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా సిబ్బంది కూడా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తుండడంతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. – సంజీవరెడ్డి, 108 అంబులెన్సుల జిల్లా మేనేజర్

దక్షిణ భారత సైన్స్‌ఫేర్‌లో సత్తా



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

అనంతపురం ఎడ్యుకేషన్: దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫేర్)లో జిల్లా ప్రాజెక్టులు సత్తా చాటాయి. బెంగళూరుకు చెందిన విశ్వేశ్వరయ్య మ్యూజియం, ఏపీ విద్యాశాఖ సంయుక్తంగా విజయవాడలో గత నెల 28 నుంచి నిర్వహిస్తున్న వైజ్ఞానిక ప్రదర్శన గురువారం ముగిసింది. దక్షిణ భారతదేశానికి చెందిన ఆరు రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా నుంచి నాలుగు ప్రాజెక్టులను ఇందులో ప్రదర్శించారు. రెండు ప్రాజెక్టుల విద్యార్థులు విజేతలుగా నిలువగా, మరో రెండు ప్రాజెక్టుల విద్యార్థులు ప్రత్యేక బహుమతులకు ఎంపిక కావడం విశేషం. గుత్తి కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు ఎస్. బెన్నీ, కె. మహేంద్ర రెడ్డి, గైడ్ టీచర్ శామ్యూల్ ప్రతాప్ సహాయంతో తయారు చేసిన 'కవచ్, రైల్వే లైట్స్ విత్ బ్లూటూత్' అనే ప్రాజెక్టు గ్రూపు విభాగంలో, కసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఎస్. హేమసాగర్ తన గైడ్ టీచర్ నారాయణ సాయంతో 'జామెట్రీ డ్రైవ్ ఎకో టాయిలెట్' అనే అంశంపై చేసిన ప్రాజెక్టు వ్యక్తిగత విభాగంలో రాష్ట్రస్థాయి నాలుగో స్థానంలో నిలిచాయి. అలాగే, టీచర్ గ్రూప్‌లో కరుట్లపల్లి జిల్లా పరిషత్ టీచర్ మహమ్మద్ రఫీ తయారు చేసిన ప్రాజెక్టు, పుట్లూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని పి. అనూహ్యరెడ్డి, గైడ్ టీచర్ రాజేశ్వరి సహకారంతో రూపొందించిన ప్రాజెక్టు ప్రత్యేక బహుమతులకు ఎంపికయ్యాయి. ప్రతిష్టాత్మక దక్షిణ భారత సైన్స్ ఫేర్‌లో జిల్లా నుంచి పాల్గొన్న నాలుగు ప్రాజెక్టులూ వివిధ విభాగాల్లో బహుమతులకు ఎంపిక కావడం ఆనందదాయకమని జిల్లా విద్యాశాఖాధికారి వి.నాగరాజు, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ పేర్కొన్నారు. విజేతలు, గైడ్ టీచర్లను, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

నేడు పాలక మండలి సమావేశం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పాలకమండలి సమావేశం శుక్రవారం నిర్వహించనున్నారు. అందుబాటులో ఉన్న పాలక మండలి సభ్యులు నేరుగా, స్థానికంగా అందుబాటులో లేని వారు వర్చువల్‌గా సమావేశంలో పాల్గొననున్నారు. నూతన వీసీగా ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి నియమితులైన తరువాత తొలి పాలకమండలి సమావేశం నిర్వహిస్తుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలా ఉండగా ఛాన్సలర్/ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను వీసీ హుస్సేన్ రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలవనున్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, హాజరైన అధికారులు

అనంతపురం అర్బన్: ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి, రెండో సంవత్సరం పరీక్షలకు 41,556 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఎథిక్స్ పరీక్షలు 143 జూనియర్ కళాశాలల్లో శుక్ర, శనివారాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు జరుగుతాయన్నారు. ఈనెల 5 నుంచి 20 వరకూ 20 కేంద్రాల్లో ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ప్రాక్టికల్స్, ఈ నెల 11 నుంచి 20 వరకూ జనరల్ విద్యార్థులకు 70 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు.

58 కేంద్రాల్లో థియరీ పరీక్షలు

జిల్లావ్యాప్తంగా 58 కేంద్రాల్లో ఇంటర్ థియరీ పరీక్షలు మార్చి 1 నుంచి 20 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయన్నారు. మొదటి సంవత్సరం పరీక్షకు 24,446 మంది, రెండో సంవత్సరం పరీక్షకు 17,110 మంది విద్యార్థులు మొత్తంగా 41,556 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. వైద్య శిబిరం నిర్వహించాలన్నారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పరీక్షల నేపథ్యంలో అనంతపురం ప్రాంతీయ పర్యవేక్షణ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ (నం: 08554- 274256) ఏర్పాటు చేశామని ఇంటర్ పరీక్షల కన్వీనర్, డీవీఈఓ వెంకటరమణ నాయక్ తెలిపారు. విద్యార్థులు సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చన్నారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ప్రతి విద్యార్థికీ తప్పనిసరిగా హాల్‌టికెట్ మంజూరు చేయాలన్నారు. ప్రాక్టికల్ పరీక్షల కోసం ప్రత్యేక రుసుం వసూలు చేయరాదన్నారు. ఎవరైనా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీఈఓ నాగరాజు, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, కార్మిక శాఖ డీసీఓ లక్ష్మి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

అనంతపురం సెంట్రల్: రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని కలెక్టర్ గౌతమి అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని రవాణ శాఖ ఆధ్వర్యంలో గురువారం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక కేఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాల వద్ద కలెక్టర్ గౌతమి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనాలు నడపడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. చిన్న తప్పిదంతో కుటుంబాలను ఇబ్బందుల పాలు జేస్తుండడం బాధాకరమన్నారు. అవగాహన కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ప్రయాణ సమయంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్స్ వాహనదారులు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. హెల్మెట్ ధారణతో ప్రమాద తీవ్రతను ఏ విధంగా తగ్గించుకోవచ్చనే విషయాలను రవాణ శాఖ అధికారులు వివరించారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ మేఘ స్వరూప్, ఉప రవాణా కమిషనర్ వీర్రాజు, ఆర్టీఓ వెంకటేష్, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఓబుల్ రెడ్డి, రహదారుల శాఖ సిబ్బంది, వాహనదారులు, తదితరులు పాల్గొన్నారు.

తప్పులుంటే తెలియజేయండి

అనంతపురం అర్బన్: ఓటర్ల జాబితాకు సంబంధించి దరఖాస్తుల పరిష్కారంలో ఎక్కడైనా తప్పు జరిగినట్లు గుర్తిస్తే తెలియజేయాలని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ గౌతమి రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా ఓటరు నమోదు, ఓటు తొలగింపు, ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులకు సంబంధించి దరఖాస్తులు, అభ్యంతరాలు 74,436 అందాయన్నారు. ఇందులో 6,200 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయన్నారు. 34,331 పరిష్కరించారని, 33,905 పరిష్కరించాల్సి ఉందన్నారు. ప్రతి దరఖాస్తును బీఎల్ఓ క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడంతో పాటు దరఖాస్తుదారునితో మాట్లాడి వివరాలు తీసుకుంటున్నారన్నారు. ఆ తరువాత వాటిని ఈఆర్ఓకు పంపిస్తారన్నారు. దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కార క్రమంలో ఎక్కడైనా పొరపాట్లు లేదా తప్పిదాలు జరిగినట్లుగా గుర్తిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.సమావేశంలో డీఆర్ఓ గాయత్రిదేవి, ఎన్నికల సెల్ తహసీల్దారు భాస్కర్, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారం ఇలా..

- కొత్తగా ఓటరు నమోదుకు 26,220 (ఫారం–6) దరఖాస్తులు అందాయి. 2,464 తిరస్కరించగా 10,278 ఆమోదించారు. 13,478 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది.
- ఓటు తొలగింపునకు 26,056 (ఫారం–7) దరఖాస్తులు అందాయి. 3,145 తిరస్కరించగా 10,686 ఆమోదించారు. 12,225 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది.
- ఓటరు వివరాలు చేర్పులు, మార్పులకు 22,160 (ఫారం–8) దరఖాస్తులు అందాయి. 591 తిరస్కరించగా 13,367 ఆమోదించారు. 8,202 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది.

సౌకర్యాల కల్పనకు రైల్వే బడ్జెట్‌లో పెద్దపీట

గుంతకల్లు: ప్రయాణికులకు సౌకర్యాల కల్పనకు రైల్వే బడ్జెట్‌లో పెద్దపీట వేసినట్లు డీఆర్ఎం వినీత్ సింగ్ అన్నారు. గురువారం స్థానిక డీఆర్ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యాల కల్పనే ధ్యేయంగా బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్‌కు రూ.9,138 కోట్లు కేటాయించారన్నారు. ట్రాఫిక్ అధికం కావడంతో ట్రిబుల్ లైన్లతో పాటు ఫోర్‌లైన్ రైలు మార్గాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని, గుంతకల్లు డివిజన్ మీదుగా కూడా ఫోర్‌లైన్ మార్గం వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుత బడ్జెట్‌ను గుంతకల్లుతోపాటు గుంటూరు, విజయవాడ డివిజన్‌లు పంచుకోవాల్సి ఉంటుదన్నారు. బడ్జెట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు జోనల్ కేంద్రం నుంచి విడుదలయ్యే పింక్ బుక్ ద్వారా తెలియాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సూర్యనారయణ, సుధాకర్, సీనియర్ డీసీఎం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: వృద్ధుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్



ఉరవకొండ: పింఛన్ నగదు అందుకున్న ఆనందంలో లబ్ధిదారులు

తొలిరోజే 83 శాతం పింఛన్ల పంపిణీ

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. గురువారం ఉదయం నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి నగదు అందజేశారు. జిల్లాలో 2,90,854 మంది పింఛన్‌దారులు ఉండగా, తొలి రోజే 2,40,757 మందికి అందజేసి 83 శాతం మేర పంపిణీ పూర్తి చేశారు. జిల్లాలో వృద్ధాప్య పింఛన్లు 1,47,145 ఉండగా, వితంతు 66,997, దివ్యాంగులు 46,817, చేనేత కార్మికులు 6,834, ఒంటరి మహిళలు 6,764, అభయ హస్తం 4,285, డప్పు కళాకారులు 3,161, మెడికల్ 3,296, చర్మకారులు 3,539, మత్స్యకారులు 892, గీత కార్మికులు 358, ట్రాన్స్‌జెండర్ 210, కళాకారులు 189, సైనిక సంక్షేమం 6, డయాలసిస్ పేషెంట్లు 363 మందికి పింఛన్ అందజేస్తున్నారు.

సిలిండర్ సరఫరాకు చార్జీ వసూలు చేస్తే చర్యలు

అనంతపురం అర్బన్: వంటగ్యాస్ సిలిండర్ సరఫరాకు వినియోగదారుల నుంచి రవాణా చార్జీని వసూలు చేయకూడదని కలెక్టర్ ఎం. గౌతమి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఏజెన్సీలపై కఠిన చర్యలు ఉంటాయని గురువారం ఒక ప్రకటన ద్వారా హెచ్చరించారు. సిలిండర్ సరఫరా కోసం ప్రయాణించిన దూరాన్ని నిర్ధారించిన తరువాత కార్యాచరణ ప్రాంతానికి మించి ఉన్న గ్రామాలకు మాత్రమే చార్జీలను అనుమతించాలన్నారు. ప్రతి డిస్ట్రిబ్యూటర్‌షిప్ కార్యాచరణ పరిధికి మించిన గ్రామాల జాబితాను విస్తృత ప్రచారం కోసం కలెక్టర్ వద్ద అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సరఫరాకు అదనపు చార్జీలు వసూలు చేయకూడదని పలుమార్లు సూచించినా పంపిణీదారుల్లో మార్పు రావడం లేదన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఉల్లంఘించడాన్ని తీవ్రంగా పరిగణిస్తామన్నారు. చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

రీ-సర్వే వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: సమగ్ర భూ సర్వేకు సంబంధించి రీ-సర్వే వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన సర్వే భూ రికార్డుల శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. మూడో విడత రీ-సర్వే రికార్డులను పరిశీలించారు. రీ-సర్వేపై రైతులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ''భూముల సర్వే సక్రమంగా చేశారా..? సర్వే తీరుపై సంతృప్తి చెందారా...? ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా...?'' అని ఆరా తీశారు. సమస్య ఉంటే తహసీల్దారు, సర్వే ఏడీని సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఎక్కడైనా జాయింట్ ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సల్ మ్యాప్) ఉంటే తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్వే భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్, ఇతర సిబ్బంది ఉన్నారు.

జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

అనంతపురం: ఒడిశాలోని భువనేశ్వర్ వేదికగా ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకూ జరిగే జాతీయ స్థాయి 73వ బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టులో జిల్లాకు చెందిన క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు. ఎంపికైన వారిలో లిఖిత్, సత్యప్రకాష్, ద్వారకానాథ్ రెడ్డి ఉన్నారు. ఏపీ జట్టులో చోటు దక్కించుకున్న క్రీడాకారులను జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎం హబీబుల్లా, సెక్రెటరీ కె.నరేంద్రచౌదరి అభినందించారు.

'హంద్రీ-నీవా'కు సీఎం అభయం

- ఉరవకొండ నియోజకవర్గంలో దశాబ్దాల సమస్యలకు పరిష్కారం
- సీఎం హామీతో ప్రతిపాదనలు సిద్ధం చేసిన జిల్లా యంత్రాంగం
- రూ.198.46 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి నివేదిక
- త్వరలో జీడిపల్లి పునరావాసం, ఆయకట్టు అభివృద్ధి, చెరువులకు నీళ్లు



76,058 ఎకరాలు సస్యశ్యామలం

అనంతపురం సెంట్రల్: హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్ట్ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అభయమిచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో తాగు, సాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణాజలాలను అందించే పనులకు శ్రీకారం చుట్టారు. జీడిపల్లి జలాశయం నుంచి బీటీపీకి నీటిని తీసుకెళ్లేందుకు కాలువ తవ్వేందుకు అవసరమైన భూ సేకరణకు రూ. 135 కోట్లు నిధులు మంజూరు కావడంతో పనులు శరవేగంగా సాగుతున్నాయి. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 114 చెరువులను నింపుతూ బీటీపీకి నీరందివ్వడంతో పాటు ప్రాజెక్టు కింద ఉన్న 12,400 ఎకరాలను సస్యశ్యామలం చేయనున్నారు. తాజాగా ఉరవకొండ నియోజకవర్గంలో దశాబ్దాలుగా నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకున్నారు. ఇటీవల ఉరవకొండ పర్యటనకు వచ్చిన ఆయన నియోజకవర్గ ప్రజల ప్రధాన సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీనిచ్చారు. అంతేకాక అప్పటికప్పుడు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు నివేదిక సిద్ధం చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించారు.

హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు కింద ఇప్పటి వరకూ ప్రత్యక్షంగా తాగునీరు, పరోక్షంగా సాగునీటిని అందిస్తున్నారు. తాజాగా ఆయకట్టు అభివృద్ధికి జగన్ సర్కార్ ఆమోదం తెలపడంతో జిల్లాలోనే అత్యధిక ఆయకట్టు కలిగిన ఉరవకొండ నియోజకవర్గం సస్యశ్యామలం కానుంది. హంద్రీ-నీవా 33వ ప్యాకేజ్‌లో 20,600 ఎకరాలు, 34వ ప్యాకేజ్ కింద 17,300 ఎకరాలు, 36(ఏ) ప్యాకేజ్ పరిధిలో 65,600 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో 76,058 ఎకరాలకు సంబంధించి ఫీల్డ్ చానల్స్ నిర్మాణానికి భరోసా దక్కడంతో ఇందు కోసం రూ.68.45 కోట్లు అవసరమవుతాయని అధికారులు నిర్ణయించారు.

12 చెరువులకు రూ.27.33 కోట్లు

హంద్రీ-నీవా ప్రాజెక్ట్ ద్వారా ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల పరిధిలోని 12 చెరువులకు నీరిచ్చి దాదాపు 2,230 ఎకరాలను సస్యశ్యామలం చేయాలని నిర్ణయించారు. కేవలం సప్లై చానల్ నిర్మిస్తే గ్రావిటీ ద్వారా 12 చెరువులకు నీరు అందుతుంది. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధుల విడుదలకు సుముఖత వ్యక్తం చేసింది. దీంతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించారు రెండు నియోజకవర్గాల పరిధిలోని చెరువులకు నీరు అందించేందుకు రూ.27.33 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు.

జీడిపల్లికి పునరావాసం

హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా 2012 నుంచి జిల్లాకు కృష్ణాజలాలు అందుతున్నాయి. ఈ క్రమంలో రిజర్వాయర్ కింద ఉన్న జీడిపల్లి గ్రామంలోకి ఊట నీరు చేరుకుంటోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో గత టీడీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గ్రామ ప్రజలకు పునరావాసం కల్పించడంలో అంతులేని నిర్లక్ష్యాన్ని కనబరిచింది. ఇదే అంశాన్ని ఇటీవల ఉరవకొండ పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి స్థానిక మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తీసుకెళ్లారు. దీంతో ఆయన అప్పటికప్పుడు అధికారులతో చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ఆదేశించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద జీడిపల్లి గ్రామానికి రూ.82.68 కోట్ల మేర నిధులు విడుదల కానున్నాయి. దీంతో దశాబ్దాలుగా జీడిపల్లి వాసులతో పాటు ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్న సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కనుంది.

రుణపడి ఉంటాం



ఉరవకొండ ప్రజలను టీడీపీ నాయకులు ఇన్నాళ్లు మోసం చేస్తూ వచ్చారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని హామీలు నెరవేర్చాం. త్వరలో హంద్రీ-నీవా ఆయకట్టు అభివృద్ధి, జీడిపల్లి గ్రామస్తులకు పునరావాసం, చెరువులకు నీళ్లు అందించబోతున్నాం. మా విజ్ఞప్తులను మన్నించి నిధులు విడుదలకు హామీనిచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. – వై. విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ

త్వరలో నిధులు



ఉరవకొండ పర్యటన సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించాం. త్వరలో నిధులు విడుదల అయ్యే అవకాశముంది. దీంతో దీర్ఘకాలికంగా గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గ ప్రజలు పడుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం దక్కుతుంది. ముఖ్యంగా జీడిపల్లి గ్రామస్తులకు పునరావాసం కల్పించబోతున్నాం. ఆయకట్టు అభివృద్ధితో పాటు చెరువులకూ నీరిస్తే రెండు నియోజకవర్గాలూ సస్యశ్యామలమవుతాయి. – దేశేనాయక్, ఎస్ఈ, హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్

పీఆర్ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన ఈరాస్వామి



ఎస్ఈ ఈరాస్వామికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈఈలు డీఈఈలు

అనంతపురం సిటీ: జిల్లా పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ)గా ఎం.ఈరాస్వామి గురువారం బాధ్యతలు చేపట్టారు. కృష్ణా జిల్లాలో పని చేస్తూ దీర్ఘకాలిక సెలవులో వెళ్లిన ఆయన్ను.. అనంతపురం ఎస్ఈగా నియమించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనకు ఈఈలు చంద్రశేఖర్, ప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రాచంరెడ్డి భాస్కర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, రసూల్, కార్యాలయ సూపరింటెండెంట్ గీత, సీనియర్ అసిస్టెంట్ రమాదేవి, ఏఈలు పాండురంగారెడ్డి, హుస్సేన్‌బాషా, కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. తాను గతంలో ఇదే జిల్లాలో జేఈఈగా పని చేశానని ఈ సందర్భంగా ఎస్ఈ గుర్తు చేశారు. జిల్లాపై పూర్తి అవగాహన ఉందని పేర్కొన్నారు.

ప్రగతిలో వెనుకబడితే సహించేది లేదు

ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఈ విషయంలో ఎవరైనా వెనుకబడితే సహించేది లేదని పీఆర్ ఇంజినీర్లను ఆ శాఖ ఎస్ఈ ఈరాస్వామి హెచ్చరించారు. ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తన చాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఈఈలు చంద్రశేఖర్, కేవీకేవీ ప్రసాద్, డీఎల్ శ్రీనివాసులు, డీఈఈలు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, చంద్రకుమార్, డీఎల్ మురళీ, రసూల్, రాజన్న, ఏఈఈలు హుస్సేన్‌బాషా, లక్ష్మీదేవి, టెక్నికల్ ఆఫీసర్ కృష్ణానాయక్, సూపరింటెండెంట్ గీత, ఇతర సబ్ డివిజన్ ఇంజినీర్లు హాజరయ్యారు. ఎన్నికల సమయం సమీపిస్తున్నందున కోట్లాది రూపాయలతో చేపట్టిన పనులన్నీ గడువులోపు పూర్తి చేయాలన్నారు.

సేవాగఢ్ ఉత్సవాలు విజయవంతం చేద్దాం

- డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ సేవాగఢ్‌లో ఈ నెల 13 నుంచి మూడ రోజుల పాటు జరిగే సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి ఉత్సవాలను విజయవంతం చేద్దామంటూ అన్ని శాఖల అధికారులకు డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి పిలుపునిచ్చారు. సేవాలాల్ జయంతి ఉత్సవ ఏర్పాట్లపై గురువారం సేవాగఢ్‌లోని టీటీడీ కల్యాణ మంటపంలో సేవాగఢ్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, ప్రధాన కార్యదర్శి, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్థనాయక్, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఇతర మండల అధికారులతో కలిసి వారు సమీక్షించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గుత్తి, గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ ప్రాంతాల నుంచి బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. తాగునీటి సౌకర్యం, తాత్కాలిక స్నానపు గదులు, మరుగుదొడ్ల ఏర్పాటుపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఉత్సవాల సందర్భంగా సమీప గ్రామాల్లో నాటుసారా అమ్మకాలు జరగకుండా చూడాలని సెబ్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు ఈ 13 నుంచి 15వ తేదీ వరకూ సేవాగఢ్‌లోనే ఉంటూ ఏర్పాట్లను పర్యవేక్షించాలని తీర్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పా వెంకటేష్, సీఐ వెంకట్రామిరెడ్డి, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజకుమార్, విద్యుత్ ఏఈ శ్రీకుమార్ పాల్గొన్నారు

మిత్ర ద్రోహి.. అందుకే హతమార్చా!

- స్నేహితుడి భార్యతో వివాహేతర సంబంధం
- మూడు రోజుల క్రితం యువకుడి హత్య
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రాప్తాడు రూరల్: 'స్నేహితుడని నమ్మినందుకే మిత్రద్రోహం చేశాడు. కుటుంబ సభ్యుడిగా చేరదీసిన నా భార్యను మాయమాటలతో లోబరుచుకున్నాడు. అందుకే వాడిని హతమార్చా' అంటూ యువకుడి హత్య కేసులో నిందితుడు పోలీసుల ఎదుట తన నేరాన్ని అంగీకరించాడు. మూడు రోజుల క్రితం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పంచాయతీ కట్టకిందపల్లికి వెళ్లే దారిలో చోటు చేసుకున్న రాజేష్‌నాయక్ హత్య కేసులో నిందితుడిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి ద్విచక్రవాహనం, కత్తి స్వాధీనం చేసుకున్నారు. వివరాలను డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ రామకృష్ణారెడ్డి గురువారం వెల్లడించారు. గార్లదిన్నె మండలం జంబులదిన్నె కొట్టాలకు చెందిన రాజేష్ నాయక్ అనంతపురం శివారులోని రుద్రంపేట పంచాయతీ పంతుల కాలనీకి చెందిన బెస్త ఆంజనేయులు అలియాస్ వీరాంజనేయులు స్నేహితులు. రాజేష్‌నాయక్ తరచూ ఆంజనేయులు ఇంటికి వస్తూ అతని భార్యతో పరిచయం పెంచుకుని వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. గత నెల 29న తెల్లవారుజామున ఇంట్లోని బాతురూమ్‌కు వెళ్లిన ఆంజనేయులుకు అక్కడ రాజేష్‌నాయక్ ఉండడం చూసి కంగు తిన్నాడు. భార్యతో వివాహేతర సంబంధం నిజమేనని నిర్ధారించుకుని ఆయన ఎలాగైనా రాజేష్‌నాయక్‌ను మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నాడు. అదే రోజు రాత్రి 9 గంటలకు ఆంజనేయులు నేరుగా నాయక్‌ను కలిసి మంచిగా మాట్లాడుతూ మందు తాగుదామంటూ నమ్మించి పిలుచుకెళ్లాడు. నాయక్‌కు చెందిన బైక్‌పైనే ఇద్దరూ వెళ్లారు. కక్కలపల్లి కాలనీ పంచాయతీ నందమూరినగర్ వెనుక ఉన్న సీవీ రామన్ జూనియర్ కళాశాల సమీపంలోకి చేరుకున్న తర్వాత మద్యం సేవించారు. అయితే పథకం ప్రకారం మోతాదుకు మించి రాజేష్ నాయక్‌తో మద్యం తాపించడంతో నిద్రలోకి జారుకున్నాడు. ఇదే అదనుగా భావించిన ఆంజనేయులు తన వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా పొడిచాడు. రాజేష్ నాయక్ మృతి చెందినట్లు నిర్ధారించుకున్న తర్వాత అక్కడి నుంచి పరారయ్యాడు. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన వారు గుర్తించి సమాచారం అందివ్వడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో తన కోసం పోలీసులు గాలిస్తున్నట్లుగా తెలుసుకున్న ఆంజనేయులు బుధవారం కక్కలపల్లి కాలనీ సచివాలయం-3 వీఆర్వో జిలాన్ ఆశిక్ వద్దకెళ్లి చేసిన నేరాన్ని అంగీకరించి, ఆయన ద్వారా రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి వద్ద లొంగిపోయాడు. విచారణ అనంతరం నిందితుడిపై హత్య కేసు నమోదు చేసి, న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. 24 గంటల్లోనే నిందితుడు లొంగిపోయేలా చొరవ చూపిన సీఐ రామకృష్ణారెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు కిష్టప్ప, గిరిబాబు, కానిస్టేబుళ్లు రాజశేఖర్, శివ, జయరామ్, పాండవ బృందాన్ని డీఎస్పీ అభినందించారు.

ప్రైవేట్ స్కూల్ టీచర్ ఆత్మహత్య



హనుమన్న (ఫైల్)

గుంతకల్లు రూరల్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ ప్రైవేట్ స్కూల్ టీచర్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని ఎస్కేపీ డిగ్రీ కళాశాల సమీపంలో నివాసముంటున్న మొలగవెల్లి హనుమన్న (42) స్థానిక ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల నేసే కాలనీలో సొంత ఇంటిని నిర్మించుకున్నారు. నిర్మాణానికి దాదాపు రూ.10 లక్షల మేర అప్పులయ్యాయి. ఈ క్రమంలోనే కొంత కాలంగా కోర్టులో నడుస్తున్న ఆస్తుల కేసులో ఆయనకు వ్యతిరేకంగా తీర్పు వెలువడింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన గత ఆదివారం రాత్రి విషపు గుళికలు మింగాడు. విషయం గమనించిన భార్య పుష్ప వెంటనే ఆయనను బెంగళూరులోని ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరిస్థితి విషమిస్తుండడంతో వైద్యుల సూచన మేరకు తిరిగి గుంతకల్లుకు తీసుకువచ్చి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక గురువారం ఉదయం ఆయన మృతి చెందారు. ఘటనకు సంబంధించి మృతుడి భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

తహసీల్దార్లకు రిలీవింగ్ ఉత్తర్వులు

అనంతపురం అర్బన్: ఎన్నికల నేపథ్యంలో జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లను రిలీవ్ చేస్తూ కలెక్టర్ ఎం.గౌతమి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా రెవెన్యూశాఖ పరిధిలోని 38 మంది తహసీల్దార్లను ఇతర జిల్లాలకు ప్రభుత్వం బదిలీ చేసింది. దీంతో వీరందరూ రిలీవ్ అయ్యారు. ఇతర జిల్లాల నుంచి జిల్లాకు బదిలీపై రానున్న తహసీల్దార్లు శుక్రవారం రిపోర్టు చేసుకునే అవకాశమున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

పశుశాఖ జేడీకి రాష్ట్ర స్థాయి అవార్డు



మంత్రి సీదిరి అప్పలరాజు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పశుశాఖ జేడీ సుబ్రహ్మణ్యం



అవార్డు అందుకుంటున్న ఏడీడీఎల్ ఏడీ రామచంద్ర

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పశుసంవర్ధకశాఖ అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల అమలులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆ శాఖ అనంతపురం జిల్లా జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం... రాష్ట్ర స్థాయి ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. ఏటా రిపబ్లిక్‌డేను పురస్కరించుకుని పశుశాఖ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో మొదటి మూడు స్థానాలు దక్కించుకున్న జిల్లాలకు అవార్డులు ప్రదానం చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో 26 జిల్లాల పరిధిలో మూడో స్థానం అనంతపురం జిల్లా దక్కించుకోగా... గురువారం గుంటూరులోని పశుశాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర కుమార్ చేతుల మీదుగా ఆయన సన్మానం అందుకుని ప్రశంసాపత్రం, మెమెంటో స్వీకరించారు. ఇక వ్యక్తిగత ప్రతిభ అంశంలో స్థానిక పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (ఏడీడీఎల్) అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామచంద్రకు రాష్ట్ర స్థాయి ఉత్తమ సేవా అవార్డును మంత్రి అప్పలరాజు అందజేశారు. అవార్డు అందుకున్న జేడీ, ఏడీలను ఆ శాఖ అధికారులు, సిబ్బంది అభినందించారు.

ట్రాక్టర్ ఢీకొని కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి

ఉరవకొండ: ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని గంగానగర్‌లో నివాసముంటున్న పి.శివానంద (49) అదే మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ పద్ధతిలో వాటర్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం తన చెల్లెలను పిలుచుకుని ద్విచక్ర వాహనంపై ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామంలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. వజ్రకరూరు సమీపంలోని మారెమ్మ ఆలయం వద్దకు చేరుకోగానే ఉరవకొండ నుంచి గుంతకల్లుకు కట్టెల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఢీకొంది. ఘటనలో తలకు తీవ్ర గాయమైన శివానందను 108 అంబులెన్స్‌లో గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై వజ్రకరూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడికి భార్య నాగమణి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలు



విజేత ట్రోఫీని అందజేస్తున్న అనంతపురం మునిసిపల్ కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం: ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. అనంతపురంలోని పీటీసీ మైదానంలో తొలిరోజు మహిళా విభాగంలో జరిగిన పోటీలు హోరాహోరీగా సాగాయి. వాలీబాల్ విభాగంలో అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. తాడిపత్రి రెండో స్థానం, ఉరవకొండ మూడో స్థానం దక్కించుకున్నాయి.

అలాగే ఖోఖోలో మొదటి స్థానాన్ని రాయదుర్గం కైవసం చేసుకోగా, రెండో స్థానం ఉరవకొండ, మూడో స్థానం అనంతపురం, కబడ్డీలో మొదటి స్థానం అనంతపురం, రెండో స్థానంలో రాప్తాడు, మూడో స్థానంలో గుంతకల్లు నిలిచాయి. బ్యాడ్మింటన్‌లో మొదటి స్థానం గుంతకల్లు, రెండో స్థానం అనంతపురం, మూడో స్థానం రాయదుర్గం దక్కించుకున్నాయి. క్రికెట్‌లో మొదటి స్థానం శింగనమల, రెండో స్థానం రాయదుర్గం, మూడో స్థానాన్ని కళ్యాణదుర్గం సాధించింది. ప్రతిభ చాటిన క్రీడాకారులకు అనంతపురం మునిసిపల్ కమిషనర్ మేఘ స్వరూప్ పతకాలు, ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి నరసింహారెడ్డి పాల్గొన్నారు

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు శింగనమల జట్టు

బుక్కరాయసముద్రం: ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో శింగనమల నియోజకవర్గం బాలికల జట్టు విజేతగా నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రాయదుర్గం జట్టుతో తలపడిన శింగనమల నియోజకవర్గం జట్టు తొలుత బ్యాటింగ్ చేపట్టి నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 106 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన రాయదుర్గం జట్టు 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 71 పరుగులకే పరిమితమైంది. దీంతో 36 పరుగుల తేడాతో శింగనమల నియోజకవర్గం జట్టు విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. జట్టులో బీకేఎస్ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన విద్యార్థులే క్రీడాకారులుగా ఉండడం గమనార్హం.



క్రికెట్‌లో విజేతగా నిలిచిన శింగనమల నియోజకవర్గ జట్టు

నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

- ఇప్పటికే నియోజకవర్గంలో రూ.1,045 కోట్ల అభివృద్ధి
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశామని, రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే, మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హామీ ఇచ్చారు. గురువారం నగరంలోని 9,10,11 డివిజన్ల పరిధిలోని వివిధ కాలనీల్లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఆ కాలనీల్లోని ప్రతి గడపకూ వెళ్లిన ఎమ్మెల్యే .. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి కర పత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ప్రభుత్వం చేసిన మేలు మర్చిపోలేమని, రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీకి అండగా నిలుస్తామని ప్రజలు ఎమ్మెల్యేకు తెలియజేశారు.

పింఛన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే...

లబ్ధిదారులకు ఎమ్మెల్యే పింఛన్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.1,045 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రతి డివిజన్‌లోనూ రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. గతంలో పింఛన్ అందాలంటే నగర పాలక సంస్థ, స్కూళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితులు ఉండేవన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే పింఛన్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, కార్పొరేటర్లు లక్ష్మిదేవి, దేవి, జయలలిత, బాలాంజనేయులు, సాకే చంద్ర, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, అనుబంధ సంఘాల అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, శ్రీదేవి, సైపుల్లాబేగ్, కొర్రపాడు హుస్సేన్ పీరా, కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, చింతా సోమశేఖర్ రెడ్డి, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు రాధాయాదవ్, నాయకులు రాధాకృష్ణ, అనిల్‌కుమార్ గౌడ్, హనుమంతు, రామయ్య, జావెద్, రాజేశ్వరి, ఉష, శోభాబాయి, భారతి, దేవి, హజరాబీ, గౌరి, జోగి రాజేంద్ర, సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ నగర్‌లో..

నగరంలోని అంబేడ్కర్ నగర్ ఆర్చ్ నుంచి శుక్రవారం ఉదయం 7:30 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.




భవానీనగర్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, సోషల్ మీడియా సభ్యులతో ఎమ్మెల్యే అనంత

జగనన్నను మరోమారు సీఎం చేసుకుందాం

అనంతపురం కార్పొరేషన్: పేదల పక్షపాతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు సీఎం చేసుకుందామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నివాస ప్రాంతంలో సోషల్ మీడియా కార్యకర్తలతో ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో సోషల్ మీడియా పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వం చేస్తున్న మంచిని పక్కన పెట్టి, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఎల్లో మీడియాతో కలసి దుష్ప్రచారం చేస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు మంచి చేసే ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి సభ్యులందరూ కార్యోన్ముఖులవ్వాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందిన సంక్షేమం, నియోజకవర్గంలో జరిగిన రూ.వేల కోట్ల అభివృద్ధికి వివరించాల్సిన అవసరం ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నగరంలో జరిగిన దుశ్చర్యలను ప్రజలను వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉంటే సోదర భావంతో ప్రజలు ఎల్లవేళలా ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు అండగా ఉంటూ అందించిన సేవలను తెలియజేయాలన్నారు. ప్రధానంగా కోవిడ్, వరదల్లో ప్రజల ప్రాణాలు కాపాడడానికి ప్రభుత్వం అందించిన సేవలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు చింతా సోమశేఖర్ రెడ్డి, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, కోకన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి, కన్వీనర్లు గోళ్ల శ్రావణ్‌రెడ్డి, కోకన్వీనర్లు జీఎన్ రాజు, జిలాన్‌బాషా, సాయిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి సహకారంతో గ్రామాల అభివృద్ధి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా సహకారం అందించాలని ఎంపీపీ హేమలత అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని పలు శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతిని తెలియజేశారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో భాగంగా ఈ నెల 15 వరకు ఈ క్రాప్ చేయించుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని, సమస్యలు ఉన్నా అందుబాటులో ఉంటూ పరిష్కరిస్తున్నారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇంటి నిర్మాణాల్లో భాగంగా చాలా మంది నిర్మాణాల్లో నిర్లక్ష్యం చూపుతున్నారని హౌసింగ్ ఏఈ అనిల్ తెలిపారు. అనంతరం ఎంఈఓ నరసింహారెడ్డి మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న నాడు– నేడు పనులపై వివరించారు.



ఇంటి నిర్మాణాలపై తెలియజేస్తున్న హౌసింగ్ ఏఈ అనిల్

గ్రామాల్లో నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి..

వేసవి రాకముందే మండలంలో ఎక్కడా నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. అనంతరం ఉపాధి హామీపై ఏపీఓ పుష్ప,విద్యుత్ శాఖపై ఏఈదాస్ తెలియజేశారు. సర్వసభ్య సమావేశానికి పలువురు మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, నీలిమ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పక్కాగా చేపట్టాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ మేఘాస్వరూప్

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పక్కాగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థలోని కౌన్సిల్ హాల్‌లో పేదలందరికీ ఇళ్లు – జగనన్న శాశ్వత స్థల హక్కు పథకంలో భాగంగా ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి వార్డు అడ్మిన్, రెవెన్యూ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ మేఘ స్వరూప్ మాట్లాడుతూ నగరంలో 24 వేలకు మందికిపైగా లబ్ధిదారులకు ఆలమూరు, కొడిమి, ఉప్పరపల్లి తదితర గ్రామాల్లో ఇంటి స్థలాలను కేటాయించినట్లు తెలిపారు. పట్టా రిజిస్ట్రేషన్ చేపట్టడానికి వార్డు అడ్మిన్లకు మార్గదర్శకాలను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి, తహసీల్దార్ బాలకృష్ణన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ మేఘ స్వరూప్

మెగా డీఎస్సీ ప్రకటించడం హర్షణీయం

అనంతపురం: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి మెగా డీఎస్సీని ప్రకటించడం హర్షణీయమని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు తిప్పలూరి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సంతోషదాయకమన్నారు. నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపేలా ముఖ్యమంత్రి నిర్ణయాలు తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి మరో 20 ఏళ్లు సుపరిపాలన చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏకంగా 1.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. అదే విధంగా తాజాగా గ్రూప్–1, గ్రూప్–2 నోటిఫికేషన్లు ఇవ్వడంతో పాటు డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులకు వరంగా మారిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు హేమంత్ కుమార్, కిరణ్ కోహ్లీ, శరత్ కుమార్, ప్రశాంతి, నితిన్, రాప్తాడు సోషల్ మీడియా కన్వనర్ తేజేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు తిప్పలూరి సుధీర్ రెడ్డి

ఆకట్టుకున్న 'జగనన్న జయకేతనం'

ఆత్మకూరు/అనంతపురం కల్చరల్: రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అనంత రంగస్థల కళాకారులు ప్రదర్శించిన 'జగనన్న జయకేతనం' పౌరాణిక పద్య నాటకం ఆకట్టుకుంది. గురువారం రాత్రి ఆత్మకూరు గ్రామంలో ప్రదర్శించిన నాటకంలో కృష్ణదేవరాయలుగా రాజారెడ్డి, తిమ్మరుసుగా వెంకటేష్, రాయల ప్రతినిధులుగా నరసింహులు, రమణ, రైతుగా దేవరపల్లి వెంకటేశ్, రైతు భార్యగా సరోజమ్మ, పాలేరుగా భీమలింగ, డప్పు అంజి తదితరుల నటన ఆకట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలపై నాటకం ఆకట్టుకుంది.



'జగనన్న జయకేతనం' నాటికలో ఓ భాగం

'రోడ్డు నిబంధనలు పాటించాలి'

కూడేరు: రోడ్డు నిబంధనలు పాటిస్తే సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవచ్చని ఆర్టీటీ ఏటీఎల్ నల్లపరెడ్డి సూచించారు. గురువారం కూడేరులోని వైఎస్ రాజశేఖరరెడ్డి సర్కిల్‌లో ఆర్టీటీ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణపై కళాకారులచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెల్‌ఫోన్లో మాట్లాడుతూ, మద్యం సేవించి, అతి వేగంగా వాహనాలు నడిపితే జరిగే ప్రమాదాలను కళాకారులు నాటక రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఏటీఎల్, ఏఎస్ఐ రామానాయుడు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. ఆటో డ్రైవర్లు కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, సూచించారు. కార్యక్రమంలో సీఓ సిద్ధప్ప, పోలీసు సిబ్బంది, కళాకారులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు

గుత్తి: పట్టణంలో గురువారం లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. ఈ నెల 22న లక్ష్మీరసింహ స్వామి కల్యాణోత్సవం జరుగనుంది. ఈ నేపథ్యంలో స్వామి మాలధారులు ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా కల్యాణోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రాలను పంపిణీ చేశారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: కడుపునొప్పి తాళలేక ఓ వివాహితఆత్మహత్యాయత్నం చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన హరిజన చిట్టెమ్మ, వన్నూరుస్వామి భార్యాభర్తలు. గత కొద్ది కాలంగా చిట్టెమ్మ కడుపునొప్పితో బాధపడుతుండేది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా కడుపునొప్పి తగ్గకపోవడంతో గురువారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

19వేల మందికిపైగా పింఛన్ పంపిణీ

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 50 డివిజన్లలోని 74 సచివాలయాల పరిధిలో 23,666 లబ్ధిదారులకు గానూ 19,955 మందికి పింఛన్ పంపిణీ చేసేలా కమిషనర్ మేఘస్వరూప్ చర్యలు తీసుకున్నారు. గురువారం ఉదయం నుంచి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. మొత్తం రూ. 7,14,45,000 (రూ.7.14 కోట్లు)గానూ రూ.6,01,62,000 (రూ.6 కోట్లకుపైగా) డబ్బు పంపిణీ చేశారు. మొత్తం 84.32 శాతం పింఛన్ పంపిణీ జరిగింది.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

శింగనమల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటశివారెడ్డి హెచ్చరించారు. గురువారం పి.జలాలపురం గ్రామంలో ప్రజలతో మాట్లాడారు. గ్రామంలో చిన్న చిన్న విషయాలకే ఘర్షణ పడడం, చెట్లు నరకడం వంటి ఘటనలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో అందరూ కలిసిమెలిసి జీవించాలన్నారు. ఏవైనా సమస్యలు వస్తే పోలీసులను సంప్రదించాలని సూచించారు. సీఐ శ్రీధర్‌రాజు, ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె బాటలో వర్సిటీ విద్యార్థులు



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డి. మురళీధర రావు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఫార్మసీ విద్యార్థులు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంప్‌లో పాల్గొన్నారు. జంగాలపల్లి గ్రామంలో వారం రోజులుగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. మురళీధర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక క్యాంప్‌ను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలను సేకరించాలన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి పలు అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. జాతీయ సేవా పథకంతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వరలక్ష్మి దేవి తదితరులు పాల్గొన్నారు.

వడ్డుపల్లిలో నీటి సమస్య పరిష్కారం

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లిలో తాగునీటి సమస్యను సర్పంచు లక్ష్మీనారాయణరెడ్డి పరిష్కరించారు. నీటి సమస్య ఉందని గ్రామస్తులు సర్పంచు దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఆయన స్పందించారు. పంచాయతీ అధికారులతో సర్పంచ్ మాట్లాడి గ్రామంలో బోరు వేయించారు. గ్రామంలో నీటి సమస్య ఉందని తెలియజేసిన వెంటనే నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన సర్పంచ్ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీవైపే రైతాంగం



మాట్లాడుతున్న రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ నారాయణ

అనంతపురం కార్పొరేషన్: రైతులందరూ వైఎస్సార్ సీపీ వైపు ఉన్నారని రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ నారాయణ తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు రైతు విభాగం ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రైతులకు జరిగిన అన్యాయం, వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన మేలును వివరిస్తామన్నారు. సమావేశంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి టీసీ నారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పర సుబ్బరావు, హనుమంతరాయుడు, ప్రకాష్‌రెడ్డి, రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

రాప్తాడు: మరూరులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యాధికారి శివకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి, చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందిరస్తారన్నారు.

మారుతీప్రసాద్ సేవలు మరువలేనివి



గణాంకాధికారి మారుతీ ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

అనంతపురం మెడికల్: ఆరోగ్య శాఖకు మారుతీ ప్రసాద్ అందించిన సేవలు మరువలేనివని, ఆయన శేష జీవితం సంతోషంగా సాగాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో గణాంకాధికారిగా ఉంటూ పదవీ విమరణ చేసిన మారుతీప్రసాద్‌కు సన్మానసభ ఏర్పాటు చేశారు. అనంతరం మారుతీ ప్రసాద్ దంపతులను డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుజాత, డాక్టర్ యుగంధర్, డాక్టర్ అనుపమ జేమ్స్, డాక్టర్ రవిశంకర్, సీపీఓ అశోక్, మలేరియా అధికారి ఓబులు తదితరులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గిరిజ మనోహర్, డెమో ఉమాపతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, హెచ్ఈఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

4న సత్సంగ సమావేశం

అనంతపురం కల్చరల్: నగరంలోని శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 4న సత్సంగ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు సమితి ప్రధాన కార్యదర్శి గుత్తి శ్రీధరమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక రామచంద్రానగర్‌లోని రామాలయంలో సమావేశం జరుగుతుందన్నారు.

సేవలు చిరస్మరణీయం



శ్రీనివాసులును సన్మానిస్తున్న అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం: పదవీ విరమణ అనివార్యమని, సేవలు చిరస్మరణీయమని అనంతపురం అదనపు ఎస్పీ ఆర్.విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోలీసు విభాగానికి శ్రీనివాసులు చేసిన సేవలపై ప్రశంసించారు. అనంతరం ఆయనతో ఉన్న అనుబంధాన్ని సహచర ఉద్యోగులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ విశ్వనాథ చౌదరి, డీపీఓ ఏఓ శంకర్, వివిధ విభాగాలకు చెందిన సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం 4న

అనంతపురం టవర్‌క్లాక్: స్థానిక జయమునెమ్మ కళ్యాణ మంటపంలో ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఉంటుందని జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కుష్టు నివారణపై అవగాహన

బుక్కరాయసముద్రం: కుష్టు నివారణపై అవగాహన పెంపొందించు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని హెల్త్ ఎడ్యుకేటర్ పర్వీన్ పేర్కొన్నారు. గురువారం వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో కుష్టు నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కుష్టు లక్షణాలు, నివారణ మార్గాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిల్‌కుష్ బేగం, ఎంసీహెచ్‌పీ కల్పన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో సీమకు అన్యాయం

అనంతపురం అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వెనుకబడిన ప్రాంతాలు, మరీ ముఖ్యంగా రాయలసీమకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అన్నారు. రాయలసీమ డిక్లరేషన్, రాయలసీమ గర్జన అంటూ ఏపీ బీజేపీ నాయకులు రంకెలు వేయడమే తప్ప, ఢిల్లీ బీజేపీ నాయకులు ఈ ప్రాంత అభివృద్ధికి చిల్లిగవ్వ ఇవ్వలేదన్నారు. గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా బడా కార్పొరేట్లకు వికాసం, సామాన్యులకు విషాదం మిగిలిందన్నారు. ప్రభుత్వ ఆస్తుల్ని, ప్రజల ఆస్తులను అంబానీ, అదాని వంటి బడా కార్పొరేట్లకు కట్టబెట్టడంలో ప్రభుత్వం జయప్రదం అయ్యిందన్నారు. విభజన చట్టంలో భాగంగా రాయలసీమ జిల్లాల్లో నెలకొల్పాల్సిన కేంద్ర సంస్థలు విషయానికొస్తే అనంతపురం జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, బెల్ తదితర పరిశ్రమలు, టెక్స్‌టైల్ పార్క్, వైఎస్సార్ జిల్లాలో ఉక్కు పరిశ్రమ, కర్నూలు జిల్లాలో రూ.400 కోట్లతో ఐఐఐటీ, రైల్వే కోచ్ నిర్మాణ పరిశ్రమ, తిరుపతిలో కండలేరు ప్రాజెక్టు, చిత్తూరులో చెన్నై– విశాఖ పారిశ్రామిక కారిడార్ తదితర హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిగా అమలు కాలేదన్నారు.

రైతులను నిరాశపర్చిన బడ్జెట్

అనంతపురం అర్బన్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులను నిరాశ పరిచిందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.మల్లికార్జున ఓ ప్రకటనలో అన్నారు. బడ్జెట్ మొత్తంలో 2.66 శాతం మాత్రమే వ్యవసాయ రంగానికి కేటాయించారన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కాబట్టి రైతుల డిమాండ్లను ఆమోదిస్తారని భావించామన్నారు. ప్రధానంగా వ్యవసాయ రుణాల మాఫీ, పీఎం కిసాన్ మొత్తం పెంపు, తదితర న్యాయమైన డిమాండ్లపై కనీస స్పందన లేదన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడే చర్యలు లేవని, కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడే బడ్జెట్‌లా ఉందన్నారు.

3,709 మందికి పింఛన్ పంపిణీ



నగరంలో పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా గురువారం గ్రామ వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 5,985 మంది లబ్ధిదారులు ఉండగా, 3,709 మందికి పింఛన్ పంపిణీ చేశారు. మొత్తం 62 శాతం పింఛన్ పంపిణీ కార్యక్రమం జరిగిందని ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు.

క్యాంపస్‌లో విద్యార్థుల బాహాబాహి

అనంతపురం: ఎస్కేయూ న్యాయశాస్త్ర విభాగంలో ఎల్ఎల్‌బీ రెండో సంవత్సరం, మూడో సంవత్సరం విద్యార్థులు బాహాబాహికి దిగారు. మూడు రోజుల క్రితం ఫ్రెషర్స్‌డే సందర్భంగా చిన్నపాటి వివాదం జరిగింది. తాజాగా గురువారం విద్యార్థులు భౌతిక దాడికి దిగారు. ఈ క్రమంలో సర్దిచెప్పడానికి వెళ్లిన అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ హుస్సేనీని కిందకు తోశారు. దీంతో వెంటనే వర్సిటీ హెల్త్‌సెంటర్‌కు వెళ్లి చికిత్స చేయించారు. ఇరువైపులా ప్రస్తుతానికి గొడవ సద్దుమణిగింది. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.కృష్ణకుమారి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు.

అదనపు కమిషనర్‌గా హరిబాబు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా పి.హరిబాబును నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కదిరి కమిషనర్‌గా ఉన్న ఈయన్ను బదిలీలో భాగంగా అనంతపురం నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా నియమించారు.



ఫెరారీకి హామిల్టన్!

ఏడుసార్లు ఫార్ములావన్ వరల్డ్ చాంపియన్, బ్రిటన్ దిగ్గజ రేసర్ లూయిస్ హామిల్టన్ మెర్సిడెస్ జట్టును వీడనున్నాడు. 2013 నుంచి మెర్సిడెస్ తరఫున పోటీపడ్డ హామిల్టన్ ఈ ఏడాది తర్వాత ఆ జట్టుతో బంధం తెంచుకోనున్నాడు. 39 ఏళ్ల హామిల్టన్ 2025 సీజన్‌లో ఫెరారీ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం దాదాపు ఖరారైంది. హామిల్టన్ 2008, 2014, 2015, 2017, 2018, 2019, 2020లలో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ గెలిచాడు. 2021లో సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి తర్వాత హామిల్టన్ మరో రేసులో విజేతగా నిలువలేకపోయాడు.

సెమీస్‌లో వైదేహి-రష్మిక జోడీ



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి శ్రీవల్లి రష్మిక డబుల్స్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఇండోర్‌లో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రష్మిక-వైదేహి (భారత్) జోడీ 6-2, 6-1తో మూడో సీడ్ కరోల్ మొనెట్ (ఫ్రాన్స్)-యపీనా (రష్యా) జంటపై నెగ్గింది. 52 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రష్మిక ద్వయం ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది.

క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ



బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రిసా జాలీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రిసా ద్వయం 21-15, 24-22తో భారత్‌కే చెందిన అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మిథున్ 21-9, 13-21, 21-17తో కిడాంబి శ్రీకాంత్‌ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అష్మిత 21-12, 15-21, 21-17తో యు పో పాయ్ (చైనీస్ తైపీ)పై నెగ్గగా... మాళవిక 22-24, 7-21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలైంది.

భారత్‌తో డేవిస్‌కప్ మ్యాచ్‌పై పాకిస్తాన్‌లో అనాసక్తి



ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్‌ల మధ్య మైదానంలో పోటీ అంటేనే ఓ సమరాన్ని తలపిస్తుంది. పెద్ద హడావుడి, హంగు, ఆర్భాటం అంతా కనిపిస్తుంది. అయితే ఇదంతా క్రికెట్‌కే పరిమితం. టెన్నిస్ అంటే ఆసక్తి అంతంతమాత్రమే! ఇప్పుడు కూడా ఆరు దశాబ్దాల తర్వాత ఇరు జట్ల మధ్య పాక్ గడ్డపై ప్రతిష్టాత్మక డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-1 పోటీలు జరగాల్సి ఉంటే... దేశంలో, రాష్ట్రంలో కాదుకదా... కనీసం వేదికైన ఇస్లామాబాద్‌లో కూడా చడీచప్పుడు లేనేలేదు. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కేవలం మీడియా, పాకిస్తాన్ టెన్నిస్ సమాఖ్య (పీటీఎఫ్) నిర్వాహకులు తప్ప ఇంకెవరి అడుగులు, చూపులు అటువైపు పడటం లేదు. మ్యాచ్‌ల కోసం పాస్‌లు, వీవీపీ పాస్‌లు కావాలనే ప్రతిపాదనలు కూడా రావట్లేదు. రేపు, ఎల్లుండి డేవిస్ కప్ మ్యాచ్ ఆడేందుకు పాకిస్తాన్‌కు వచ్చిన భారత టెన్నిస్ జట్టు సభ్యులకు అక్కడి భారత హైకమిషనర్ గీతిక శ్రీవాస్తవ విందు ఏర్పాటు చేసి ఆటగాళ్లకు బెస్టాఫ్ లక్ చెప్పారు.

మన గెలుపు హోరు వినిపించేనా!

విశాఖపట్నంలో నేటి నుంచి రెండో టెస్టు

సమరానికి సిద్ధమైన భారత్, ఇంగ్లండ్	తీవ్ర ఒత్తిడిలో టీమిండియా	ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం

కోహ్లి లేడు... కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా దూరమయ్యారు. గిల్, శ్రేయస్ బ్యాటింగ్‌లో తడబాటు కనిపిస్తోంది. తొలి టెస్టులో అనూహ్య ఓటమి జట్టు ఆత్మవిశ్వాసాన్ని కాస్త దెబ్బ తీసిన పరిస్థితి. స్పిన్ మన బలం అనుకుంటే గత మ్యాచ్‌లో అరంగేట్ర స్పిన్నర్‌కే ఆటను అర్పించేశాం. ప్రత్యర్థిని చూస్తే దేనికైనా సిద్ధం అన్నట్లుగా దూకుడుతో 'సై' అంటోంది. రెండో టెస్టుకు ముందు భారత్ పరిస్థితి ఇది. ఇలాంటి సమయంలో విశాఖ తీరాన మన జట్టు తమ స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. 'బజ్‌బాల్'కు చెక్ పెట్టి 'భారత్ బాల్'తో సత్తా చాటాల్సి ఉంది.

2016లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో ఇంగ్లండ్ ఆధిక్యం ప్రదర్శించగా మ్యాచ్ 'డ్రా' అయింది. తర్వాతి నాలుగు టెస్టులు గెలిచి భారత్ చివరకు సిరీస్‌ను 4-0తో గెలుచుకుంది. 2021లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో భారత్ ఓటమి. తర్వాతి మూడు టెస్టులు గెలిచి భారత్ 3-1తో సిరీస్ సొంతం చేసుకుంది. ఇప్పుడు 2024లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... భారత్ తొలి టెస్టు మ్యాచ్‌లో ఓడిపోయింది. గత రెండు సిరీస్‌ల తరహాలోనే టీమిండియా ఈసారి కోలుకొని తగిన రీతిలో సమాధానమిస్తూ ముందంజ వేస్తుందా!

సాక్షి, విశాఖపట్నం: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో 0-1తో వెనుకబడిన భారత జట్టు పోరును సమం చేసే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. హైదరాబాద్‌లో తొలి మ్యాచ్‌లో ఓడిన టీమిండియా రోహిత్ శర్మ నేతృత్వంలో ప్రతీకారానికి సిద్ధమైంది. మరోవైపు తమ జోరును కొనసాగిస్తూ సిరీస్‌లో ఆధిక్యాన్ని పెంచుకోవాలని స్టోక్స్ బృందం పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో నేటి నుంచి జరిగే రెండో టెస్టు మ్యాచ్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి. గత మ్యాచ్‌తో పోలిస్తే ఇరు జట్లలోనూ మార్పులు ఖాయమయ్యాయి.

పటిదార్ అరంగేట్రం!

తొలి టెస్టు ఓటమి తర్వాతి ఇప్పుడు రెండో టెస్టుకు తుది జట్టు ఎంపిక కూడా భారత్ టీమ్ మేనేజ్‌మెంట్‌కు పరీక్ష పెడుతోంది. గాయాలతో దూరమైన రాహుల్, జడేజా స్థానాల్లో రెండు మార్పులు తప్పనిసరి. రాహుల్ స్థానంలో ఒక బ్యాటర్ స్థానం కోసం రజత్ పటిదార్, సర్ఫరాజ్ ఖాన్ పోటీ పడుతున్నారు. గురువారం టీమ్ ప్రాక్టీస్, ఇతర అంశాలను బట్టి చూస్తే రజత్ వైపే ఎక్కువగా మొగ్గు ఉంది. భారత్ తరఫున పటిదార్ ఒకే ఒక వన్డే ఆడాడు. అశ్విన్, అక్షర్ మళ్లీ కీలకం కానుండగా జడేజా స్థానంలో మరో మాటకు తావు లేకుండా కుల్దీప్ మైదానంలోకి దిగుతాడు. అయితే కుల్దీప్ వస్తే బ్యాటింగ్ బలహీనంగా మారిపోతుంది. ఇలాంటి స్థితిలో ఇంగ్లండ్ తరహాలో ఒకే ఒక పేసర్‌ను ఆడించి బ్యాటింగ్ విభాగాన్ని పటిష్టం చేసుకోవడం అవసరం. అలా చేస్తే సిరాజ్ స్థానంలో సర్ఫరాజ్ అరంగేట్రం చేయవచ్చు. అయితే వీటన్నింటికంటే టాప్-4 బ్యాటింగ్ కీలకం కానుంది. ఓపెనర్లు రోహిత్, యశస్వి కాస్త ఓపిగ్గా ఆడితే భారీ స్కోరుకు కావాల్సిన శుభారంభం లభిస్తుంది. గిల్, అయ్యర్ ఇప్పటికైనా తమకు లభిస్తున్న వరుస అవకాశాలకు న్యాయం చేయాల్సి ఉంది.



హార్ట్‌లీ, స్టోక్స్

పిచ్, వాతావరణం

మంచి బ్యాటింగ్ వికెట్. కాస్త బౌన్స్‌తో పాటు మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్‌కు అనుకూలిస్తుంది. ఇక్కడ జరిగిన రెండు టెస్టుల్లోనూ భారీ స్కోర్లు నమోదు చేసిన భారత్ రెండు మ్యాచ్‌లూ (ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలపై) గెలుచుకుంది. వర్ష సూచన లేదు.

తుది జట్లు

భారత్ (అంచనా): రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, శ్రేయస్, పటిదార్, భరత్, అశ్విన్, అక్షర్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్. ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, హార్ట్‌లీ, రేహన్, బషీర్, అండర్సన్.

అండర్సన్@184



41 ఏళ్లు దాటిన పేసర్ అండర్సన్ తన కెరీర్‌లో 184వ టెస్టులో బరిలోకి దిగుతున్నాడు. అతనికి ఇది అంతర్జాతీయ క్రికెట్‌లో 22వ ఏడాది కానుండడం విశేషం. తను అరంగేట్రం చేసినప్పుడు ఇంకా పుట్టని రేహన్, బషీర్‌లతో కలిసి అండర్సన్ బౌలింగ్ చేయబోతున్నాడు.



ఆంధ్ర క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ తొలిసారి తన సొంత గడ్డపై టెస్టు మ్యాచ్ ఆడనున్నాడు. వైజాగ్‌కే చెందిన వికెట్‌కీపర్ భరత్‌కు 6 టెస్టుల స్వల్ప కెరీర్ తర్వాత ఈ అవకాశం దక్కడం విశేషం. ఈ టెస్టులో జట్టు అవకాశాల గురించి భరత్ మాట్లాడుతూ... 'అన్ని ప్రణాళికలతో మేము సిద్ధంగా ఉన్నాం. తొలి టెస్ట్ మ్యాచ్‌లో జరిగిన తప్పులపై చర్చించాం. స్వీప్ షాట్‌లపై సాధన చేశాం. మేం అలాంటి షాట్లన్నీ ఆడగలం. అయితే పరిస్థితిని బట్టే బ్యాటర్లు దానిని అమలు చేస్తారు. గత ఓటమి తర్వాత మేమేం ఆందోళనకు గురి కాలేదు. జట్టులో అంతా బాగుంది. సుదీర్ఘ సిరీస్ కాబట్టి కోలుకునే అవకాశం ఉందని మాకు తెలుసు' అని అన్నాడు.

బరిలోకి బషీర్...

ఇంగ్లండ్ తమ తుది జట్టును గురువారమే ప్రకటించింది. గాయపడ్డ స్పిన్నర్ జాక్ లీచ్ స్థానంలో ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లోకి అడుగు పెడుతున్నాడు. గత మ్యాచ్‌లో భారత్‌ను దెబ్బ కొట్టిన హార్ట్‌లీ మళ్లీ చెలరేగేందుకు సిద్ధంగా ఉండగా... అన్నింటికి మించి ఏకైక పేసర్ గా సీనియర్ బౌలర్ అండర్సన్ పునరాగమనం చేస్తుండటం విశేషం. వుడ్ స్థానంలో అతడిని ఇంగ్లండ్ ఎంపిక చేసింది. తొలి టెస్టులో ఎప్పటిలాగే తమ దూకుడైన బ్యాటింగే ఇంగ్లండ్‌ను గెలిపించింది. ఓపెనర్లు క్రాలీ, డకెట్ ధాటిగా ఆడుతుండగా పోప్ ఆట ఎలాంటిదో గత మ్యాచ్ చూపించింది. స్టార్ బ్యాటర్ రూట్ అటు బౌలింగ్‌లోనూ ప్రధానపాత్ర పోషించడం జట్టు బలాన్ని పెంచింది. అటు బ్యాటింగ్‌తో, ఇటు కెప్టెన్సీతో స్టోక్స్ విలువైన ఆటగాడు. ఇంగ్లండ్ ముగ్గురు స్పిన్నర్లు ఈసారి భారత్‌ను ఎలా నిలువరిస్తారనేది ఆసక్తికరం.



రోహిత్

బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442 కోట్లు

గతేడాది కంటే రూ.45.36 కోట్లు ఎక్కువ

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో క్రీడల కోసం రూ. 3,442.32 కోట్లు కేటాయించారు. 2023-24 వార్షిక బడ్జెట్‌లో రూ. 3,396.96 కోట్లు క్రీడలకు వెచ్చిస్తే ఈసారి రూ.45.36 కోట్లు పెంచారు. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమం కోసం రూ. 900 కోట్లు (రూ.20 కోట్లు పెరుగుదల), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు రూ. 822.60 కోట్లు (రూ.26.83 కోట్లు పెంపు) కేటాయించారు. మౌలిక వసతుల కల్పన, అథ్లెట్లకు అధునిక క్రీడా సామాగ్రి, కోచ్‌ల నియామకం కోసం ఆ మొత్తాన్ని వినియోగిస్తారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు రూ 340 కోట్లు (రూ.15 కోట్లు పెంచారు) ఇవ్వనున్నారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) బలోపేతానికి రూ. 22.30 కోట్లు కేటాయించారు. నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి రూ. 91.90 కోట్లు (రూ.8.69 కోట్లు హెచ్చింపు) కేటాయించారు.

ప్రొ కబడ్డీ లీగ్ ప్లే ఆఫ్స్, ఫైనల్‌కు హైదరాబాద్ ఆతిథ్యం



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్ ప్లే ఆఫ్స్, ఫైనల్ మ్యాచ్‌లకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు ఈ పోటీలు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతాయని పీకేఎల్ నిర్వాహకులైన మషాల్ స్పోర్ట్స్ తెలిపింది. మొత్తం 12 జట్లు పోటీ పడుతున్న ప్రొ కబడ్డీ లీగ్‌లో పాయింట్ల పట్టికలో టాప్-6లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. టాప్-2 జట్లకు నేరుగా సెమీఫైనల్ బెర్త్‌లు లభిస్తాయి. మిగతా నాలుగు జట్లు ఎలిమినేటర్ మ్యాచ్‌ల్లో తలపడతాయి. ఫిబ్రవరి 26న ఎలిమినేటర్-1లో ఆరో స్థానం పొందిన జట్టుతో మూడో స్థానంలో నిలిచిన జట్టు... ఎలిమినేటర్-2లో ఐదో స్థానంలో నిలిచిన జట్టుతో నాలుగో స్థానం పొందిన జట్టు ఆడతాయి. ఫిబ్రవరి 28న ఎలిమినేటర్-1 విజేత తొలి సెమీఫైనల్లో లీగ్ 'టాపర్'తో... ఎలిమినేటర్-2 విజేత లీగ్‌లో రెండో స్థానంలో నిలిచిన జట్టుతో పోటీపడతాయి. ఫైనల్ మార్చి 1న జరుగుతుంది.

సినిమా

గెటింగ్ రెడీ



● చిరంజీవి

'విశ్వంభర' సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు హీరో చిరంజీవి. ఈ చిత్రంలో భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ పాత్రకు సంబంధించిన మేకోవర్ కోసం చిరంజీవి కసరత్తులు చేస్తున్నారు. 'గెటింగ్ రెడీ ఫర్ విశ్వంభర' అంటూ తన వర్కౌట్స్ వీడియోను షేర్ చేశారు చిరంజీవి. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఈ సినిమాకు దర్శకుడు. ఆల్రెడీ చిత్రీకరణ మొదలైంది. అయితే ముందు చిరంజీవి పాల్గొనని సన్నివేశాలను చిత్రీకరించారు. హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో వేసిన సెట్స్‌లో ఈ నెల నుంచి 'విశ్వంభర' షూటింగ్‌లో చిరంజీవి పాల్గొంటారని తెలిసింది. ఇక ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. భారీ బడ్జెట్‌తో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎమ్ఎమ్ కీరవాణి, కెమెరా: చోటా కే నాయుడు.

చలో రష్యా



● కమల్‌హాసన్

కమల్‌హాసన్ 'థగ్ లైఫ్' రష్యాలో ఆరంభం కానుందట. 1987లో వచ్చిన 'నాయగన్' (తెలుగులో 'నాయకుడు') చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్-దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'థగ్ లైఫ్'. 'జయం' రవి, దుల్కర్ సల్మాన్, త్రిష, గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, ఐశ్వర్యా లక్ష్మీ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో రంగరాయ శక్తివేల్ నాయకర్ పాత్రలో నటిస్తున్నారు కమల్‌హాసన్. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో ప్రారంభమైంది. కమల్‌హాసన్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణను రష్యాలో ప్లాన్ చేశారట మణిరత్నం. ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారని కోలీవుడ్ సమాచారం. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.

మహేశ్ సినిమాలో?



● నాగార్జున

సూపర్ స్టార్ మహేశ్‌బాబు-కింగ్ నాగార్జున స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాలు అంటున్నాయి. ఇంతకీ ఈ కాంబినేషన్ ఏ సినిమాకీ? అంటే.. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా రూపొందనున్న చిత్రానికి అంటున్నారు. 'గుంటూరు కారం' సినిమా హిట్‌తో ఫుల్ జోష్‌లో ఉన్న మహేశ్‌బాబు తన తర్వాతి చిత్రాన్ని ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో చేయనున్న సంగతి తెలిసిందే. మహేశ్‌బాబు కెరీర్‌లో 29వ మూవీగా 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనుంది. ఈ చిత్రానికి రచయిత విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. ఇటీవలే స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన ఈ ప్రాజెక్టు కోసం నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారట రాజమౌళి. ఈ సినిమాలో సౌత్ ఇండస్ట్రీకి చెందిన పలువురు స్టార్స్ కీలక పాత్రల్లో నటించనున్నారని తెలిసింది. ఇందులో భాగంగానే నాగార్జున కూడా కీలక పాత్రలో నటించనున్నారని టాక్. సినిమాలో చాలా ప్రాధాన్యం ఉన్న ఓ పాత్రకి నాగార్జునని తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట రాజమౌళి. నాగార్జునకి దక్షిణాదితో పాటు ప్రత్యేకించి బాలీవుడ్‌లోనూ మంచి గుర్తింపు ఉంది. అందుకే జాతీయ స్థాయిలో పేరున్న నాగార్జునను 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' కోసం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భోగట్టా. ఏప్రిల్‌లో ఈ సినిమా ప్రారంభం కానుంది. మరి మహేశ్‌బాబు-నాగార్జున కాంబో తెరపై కనిపిస్తుందా? అంటే ఇప్పటికైతే సమాధానం లేని ప్రశ్న.

వేసవిలో మ్యాచ్



● సిద్ధార్థ్, నయనతార, మాధవన్

'ది టెస్ట్'ను పూర్తి చేశారు నయనతార. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో నయనతారతో పాటు మాధవన్, సిద్ధార్థ్ లీడ్ రోల్స్ చేశారు. మీరా జాస్మిన్ ఓ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాతో నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సింగర్ శక్తి శ్రీగోపాలన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు, ఈ వేసవిలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. కాగా ఈ సినిమాను గత ఏడాది నవంబరులో విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు వేసవికి వాయిదా వేశారు. తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

సరికొత్త కథతో శ్రీకారం



● అమర్‌దీప్, సుప్రీత

'బిగ్ బాస్' ఫేమ్ అమర్‌దీప్ చౌదరి హీరోగా, నటి సురేఖా వాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా కొత్త చిత్రానికి శ్రీకారం జరిగింది. ఈ చిత్రానికి మాల్యాద్రి రెడ్డి దర్శకుడు. మహర్షి కూండ్ల సమర్పణలో ఎం3 మీడియా బ్యానర్‌పై మహా మూవీస్‌తో కలిసి మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్న ఈ సినిమా గురువారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ఏఎం రత్నం కెమెరా స్విచ్చాన్ చేయగా, బసిరెడ్డి క్లాప్ కొట్టగా, వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ- ''ఇండియన్ సినిమాలో ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని కొత్త కథతో ఈ సినిమాని రూపొందిస్తున్నాం'' అన్నారు. ''మాలాంటి కొత్త వాళ్లకి ఎం3 మీడియా చాన్స్ ఇవ్వడం హ్యాపీగా ఉంది'' అన్నారు మాల్యాద్రి రెడ్డి. ''బిగ్ బాస్'కి వెళ్లకముందే ఈ సినిమా ఒప్పుకున్నాను'' అన్నారు అమర్‌దీప్ చౌదరి. సుప్రీత, నటీనటులు సురేఖా వాణి, తేజస్వి, గౌతమ్ కృష్ణ, రఘు, నటుడు, దర్శకుడు తల్లాడ సాయికృష్ణ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: దాస్ కడియాల, కెమెరా: బాల సరస్వతి.

తెలుగు, నేపాలీ భాషల్లో...



● బ్రహ్మానందం

ప్రముఖ నటుడు బ్రహ్మానందం కీలక పాత్ర పోషిస్తున్న తొలి తెలుగు, నేపాలీ చిత్రం 'హ్రస్వ దీర్ఘ'. చంద్ర పంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హరిహర్ అధికారి, నీతా దుంగన లీడ్ రోల్స్ చేస్తున్నారు. నీతా ఫిలిమ్స్ ప్రొడక్షన్స్‌పై నీతా దుంగన ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఫిబ్రవరి 1న బ్రహ్మానందం పుట్టినరోజు. ఈ సందర్భంగా 'హ్రస్వదీర్ఘ'లోని ఆయన పాత్రకి సంబంధించిన ఫస్ట్ లుక్‌ని విడుదల చేయడంతో పాటు ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 27న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

పల్లెటూరి ప్రేమకథ



● శ్రీకాంత్, వినాయక్ దేశాయ్

వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన చిత్రం 'రాధా మాధవం'. గోనాల్ వెంకటేశ్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ- ''రాధా మాధవం' ట్రైలర్ చూస్తే అందమైన ప్రేమకథా చిత్రమని తెలుస్తోంది. ట్రైలర్ చాలా బాగుంది.. సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. ''అందమైన పల్లెటూరి ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. మా సినిమా సెన్సార్ పనులు జరుపుకుంటోంది'' అన్నారు దాసరి ఇస్సాకు. ''ఈ నెలలోనే మా సినిమా రిలీజ్ అవుతుంది.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు గోనాల్ వెంకటేశ్. ''పల్లెటూరి నేపథ్యంలో సాగే ప్రేమకథతో సహజత్వం ఉట్టి పడేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దాసరి ఇస్సాకు. మా చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసిన శ్రీకాంత్‌గారికి థ్యాంక్స్'' అన్నారు వినాయక్ దేశాయ్.

విన్నర్‌గా ఎలా మారాడు?



● గీతానంద్

''గేమ్ ఆన్' యునిక్ స్టోరీ. రెగ్యులర్‌గా కాకుండా వైవిధ్యంగా చేయాలని ప్రయత్నించాం. ఈ చిత్రంలో హీరో లూజర్ నుంచి విన్నర్‌గా ఎలా మారాడు? అనేది ఆసక్తిగా ఉంటుంది. ఇందులో భాగంగా ఉండే టాస్కులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని గీతానంద్ అన్నారు. దయానంద్ దర్శకత్వంలో గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. రవి కస్తూరి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా హీరో గీతానంద్ మాట్లాడుతూ-''దయానంద్ నా తమ్ముడు కావడంతో 'గేమ్ ఆన్' స్క్రిప్ట్ విషయంలో బాగా చర్చించుకునే వాళ్లం. రవి కస్తూరి కూడా నా ఫ్రెండ్ కావడంతో ముగ్గురం చర్చించుకుని నిర్ణయాలు తీసుకునేవాళ్లం. ఈ మూవీకి సీక్వెల్ ప్లాన్ ఉంది'' అన్నారు.

మ్యూజిక్ కూడా కథ చెబుతుంది

- దేవ్ జాండ్



రవితేజ హీరోగా నటించిన చిత్రం 'ఈగల్'. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ దేవ్ జాండ్ మాట్లాడుతూ- ''నా పదో తరగతి నుంచే మ్యూజిక్ జర్నీ స్టార్ట్ చేశాను. పియానో, గిటార్, డ్రమ్స్, ప్రోగ్రామింగ్ నేర్చుకున్నాను. కొన్ని వీడియో గేమ్స్‌కి మ్యూజిక్ ఇచ్చాను. సంగీత దర్శకుడిగా 'ఈగల్' నాకు తొలి చిత్రం. కాలేజీలో నేను, హీరో శ్రీవిష్ణు క్లాస్ మేట్స్. అలా కార్తీక్ నాకు పరిచయం అయ్యాడు. ఇప్పుడు తనతో నా జర్నీ మొదలైంది. రవితేజగారితో సినిమా ఫిక్స్ అయ్యాక ఆయన ఓకే చెబితే, మ్యూజిక్ డైరెక్టర్‌గా నాకు చాన్స్ ఇస్తానన్నాడు కార్తీక్. రవితేజగారు నా మ్యూజిక్ ట్రాక్స్ విని, నచ్చి ఓకే చేశారు. రవితేజగారి సినిమాకు మ్యూజిక్ చేయడం నా లక్. ఈ సినిమాలో మ్యూజిక్, ఆర్ఆర్‌లకు మంచి స్కోప్ ఉంది. మ్యూజిక్ కూడా కథ చెబుతున్నట్లుగా ఉంటుంది. ఈ సినిమాలో నాలుగు పాటలు ఉన్నాయి. ఇక కార్తీక్ దర్శకత్వంలోనే తేజ సజ్జా హీరోగా చేస్తున్న ఓ సినిమాకు, దర్శకుడు నక్కిన త్రినాథరావుగారి ప్రొడక్షన్‌లోని ఓ మూవీకి మ్యూజిక్ ఇస్తున్నాను. మరో రెండు ప్రాజెక్ట్స్ ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.